

47వ డివిజన్‌లో మంత్రికి కోలాటం, బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న నాయకులు, మహిళలు



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

# కాంగ్రెస్, బీజేపీల కుట్రలను తిప్పి కొట్టాలి

- తెలంగాణను కాపాడుకోవాలి
- బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- నగరంలోని 47, 31, 50, 10వ డివిజన్లలో ప్రచారం

కార్పొరేషన్, నవంబర్ 20: ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి ఓటు వేస్తే వారు ఢిల్లీ గులాంలుగా మారి ఆంధ్రా నాయకుల చెప్పుచేతల్లోనే ఉంటారని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆయన నగరంలోని 47, 31, 50, 10వ డివిజన్లలో ప్రచారం చేశారు. ఆయా డివిజన్లలో మంత్రికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకగా... బీఆర్ఎస్ శ్రేణులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, తెలంగాణ రాకముందు కరీంనగర్‌లో రోడ్లు ఎలా ఉండేవి ఇప్పుడు ఎలా ఉన్నాయో గమనించాలన్నారు. పదేళ్లలో కరీంనగర్ రూపురేఖలు మార్చి గొప్పగా అభివృద్ధి చేశామన్నారు. బీఆర్ఎస్ పాలనలో వేల కోట్ల నిధులు తీసుకువచ్చి నగరంలోని అన్ని సమస్యలను పరిష్కరించే విధంగా అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. ఈద్గాల కోసం స్థలాలు కేటాయించినట్లు చెప్పారు. హిందువుల కోసం టీటీడీ టెంపుల్, క్రైస్తవుల కోసం ప్రార్థన మందిరాలు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. గత పదేళ్లలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని మతాల ప్రజలు కలిసి జీవించే విధంగా కరీంనగర్‌ను కాపాడుతామన్నారు. పదేళ్లలో ఎక్కడ మతఘర్షణలకు తావు లేకుండా శాంత్రి భద్రతలకు విఘాతం కలుగకుండా పని చేశామన్నారు. ఎన్నికల వేళ తెలంగాణను ఆంధ్రా వాళ్లు ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఆంధ్రా తొత్తులు అవుతారని విమర్శించారు. నగరంలో కొనసాగుతున్న ఈ అభివృద్ధి మరింత ముందుకు సాగాలంటే కేసీఆర్‌ను గెలిపించుకోవాలన్నారు. బీజేపీ రాష్ట్రంలో ఎక్కడా గెలిచేది లేదన్నారు. అలాంటి పార్టీకి ఓటు వేసి వృథా చేసుకోవద్దని సూచించారు. అసమర్థ ఎంపీ ఉండడం వల్ల కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా నిధులు తీసుకురాలేకపోయారని దుయ్యబట్టారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఇద్దరూ ఒకటేనని విమర్శించారు. బండిసంజయ్ కాంగ్రెస్ టికెట్ ఇప్పించారని ఆరోపించారు. వారిద్దరూ ఒక్కటై మైనార్టీల ఓట్లను చీల్చాలని చూస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల కుట్రలను తిప్పి కొట్టే విధంగా మైనార్టీలంతా కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. నగరంలో ప్రశాంత వాతావరణం ఇలాగే కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తెచ్చుకున్న తెలంగాణ దొంగల పాలు కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో చేపడుతున్న మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ఏడాదిలోగా పూర్తి చేస్తానన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే కరీంనగర్ గొప్ప నగరంగా రూపుదిద్దుకుంటుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలను గెలిపిస్తే నగరంలో ప్రస్తుతం సాగుతున్న అభివృద్ధి నిలిచిపోతుందని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు షర్ఫొద్దీన్, లెక్కల స్వప్న-వేణు, అంజయ్య, నాయకులు బాబ్‌జానీ, నలువాల రవీందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ షమీ, ఎంఐఎం నాయకుడు గులాం అహ్మద్, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



47వ డివిజన్‌లో ప్రచారానికి హాజరైన ప్రజలు

# కౌశిక్‌రెడ్డి గెలుపు ఖాయం

- ప్రతిపక్షాల పోటీ రెండోస్థానం కోసమే
- బీజేపీ, కాంగ్రెస్‌ది రహస్య ఒప్పందం
- కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో ప్రజలకు తెలియదు
- గెలిచినట్లు రేవంత్‌రెడ్డి పగటి కలలు కంటుండు
- ఎన్నికల తర్వాత ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతు
- బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి



మాట్లాడుతున్న రాజలింగారెడ్డి

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 20: ఈనెల 30న జరిగే ఎన్నికల్లో హుజూరాబాద్‌లో కాంగ్రెస్, బీజేపీ రెండో స్థానం కోసమే పోటీ పడుతున్నాయని, ఇప్పటికే కౌశిక్‌రెడ్డి గెలుపు ఖాయమైందని బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎలాగైనా గెలవమనే ఉద్దేశంతో రేవంత్‌రెడ్డి ఈటలతో రహస్య ఒప్పందం చేసుకుని అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం హుజూరాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్‌తో గత ఉప ఎన్నికలో కుట్ర చేసి రెండు పార్టీల ఓట్లు ఒక్కరికే వేయించినట్లుగా, ఇప్పుడు కూడా బీజేపీ, కాంగ్రెస్ మళ్లీ కుమ్మక్కై బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఓట్లను కాంగ్రెస్ అభ్యర్థి ప్రణవ్‌కి వేసేలా రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డికి, ఈటల రాజేందర్‌కి మధ్య డబ్బు ఇచ్చి పుచ్చుకోవడం గతం నుంచే జరుగుతుందని, అందుకే కర్ణాటక, హైదరాబాద్‌లో కోట్లాది రూపాయల నోట్ల కట్టలు దొరుకుతున్నాయని తెలిపారు. హుజూరాబాద్, గజ్వేల్ విషయంలో ఇద్దరి మధ్య ఒప్పందం జరిగిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఈటల రాజేందర్ కోవర్టు అని రాజలింగారెడ్డి ఆరోపించారు. ఆయన ఏ పార్టీల్లోకి వెళ్లిన ఆ పార్టీ భూస్థాపితమవుతోందని, ఆయన బీజేపీ, టీడీపీలోకి వెళ్తే ఆ పార్టీలు పతనమయ్యాయన్నారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్, బీజేపీ అడ్రస్ గల్లంతవుతుందన్నారు. ఈటల తనకు రాజకీయ భిక్షపెట్టిన సీఎం కేసీఆర్‌పైనే పోటీకి దిగుతున్నాడంటే.. అందుకు కారణం ఓటుకు నోటు దొంగ రేవంత్‌రెడ్డి కాదా..? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని ఢీ కొనే సత్తా లేకనే ఈటల, రేవంత్‌రెడ్డి సాయంతో గజ్వేల్‌కు పారిపోయాడని ఎద్దేవా చేశారు. గజ్వేల్, హుజూరాబాద్‌లో రెండు చోట్ల ఈటల, కామారెడ్డిలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఓటమి తప్పదని ఆయన జోస్యం చెప్పారు. ఈటల రాజేందర్‌కు ఆత్మ గౌరవం లేకనే బీజేపీలో చేరారని, ఆయనకు ఆస్తుల మీద ఉన్న ప్రేమ, నియోజకవర్గ అభివృద్ధి మీద లేదన్నారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచిన బీజేపీకి ప్రజలు ఓట్లు ఎలా వేస్తారో..? ఆలోచించాలన్నారు. బీజేపీ రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తెచ్చిందని, ఆ పార్టీపై గతంలో విమర్శలు చేసిన ఈటల రాజేందర్ ఆ పార్టీలో చేరగానే నల్ల చట్టాలు తెల్ల బడ్డాయా..? అని రాజలింగారెడ్డి ఈటలను ప్రశ్నించారు. ప్రతి గ్రామంలో పాడికి జనం నీరాజనం పలుకుతున్నారని, బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలువబోతున్నారని స్పష్టం చేశారు. సమావేశంలో కౌన్సిలర్ తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు చింత శ్రీనివాస్‌గౌడ్, కొయ్యడ కమలాకర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బత్తుల సమ్మయ్య, సంతోష్‌గౌడ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో మహిళల చేరిక



మహిళకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, నవంబర్ 20: కరీంనగర్‌లోని శ్రీరేణుకా మాత మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు పెరుమడ్ల మానస, ప్రధాన కార్యదర్శి కొత్తూరి కృష్ణవేణి, పెద్ద సంఖ్యలో మహిళలు బీఆర్ఎస్ నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం మంత్రి నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గంగుల కమలాకర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను మహిళ పేరుతోనే అందిస్తోందన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే వంట గ్యాస్ సిలిండర్ రూ.400కే అందిస్తామన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షురాలు బొమ్మ పద్మ, సహాయ కార్యదర్శి కాసారపు రాధిక, సభ్యులు పెరుమడ్ల సుజాత, పెరుమడ్ల అనిత, పెరుమడ్ల లత, మహిళలు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా



ఇల్లందకుంట: రాచపల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి

- దండం పెట్టి అడుగుతున్న 15 ఏళ్ల కష్టాన్ని గుర్తించండి
- కేసీఆర్ కాళ్లు పట్టుకొని అయినా వెయ్యి కోట్లు తెచ్చి అభివృద్ధి చేస్తా
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 20: గత 15 ఏళ్లుగా హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ తనవంతు సేవ చేస్తున్నానని, ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ప్రజలను కోరారు. పట్టణంలోని 3, 4, 5, 18, 19వ వార్డుల్లో సోమవారం రాత్రి ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ, ఉప ఎన్నికల తర్వాత రూ.50 కోట్లతో పట్టణాన్ని అభివృద్ధి చేసుకున్నామని అన్నారు. హుజూరాబాద్‌లో స్పోర్ట్స్ స్టేడియంతో పాటు మినీ కలెక్టరేట్ నిర్మిస్తానని తెలిపారు. చిలుకవాగుపై బ్రిడ్జి, మోడల్ చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దుతానని చెప్పారు. హుజూరాబాద్‌లో 20వేలకు పైగా మెజార్టీ ఇస్తే పట్టణంలోని కింది వాడలను దత్తత తీసుకుంటానని తెలిపారు. కేసీఆర్ కాళ్లు పట్టుకొని అయినా సరే రూ.వెయ్యి కోట్లు తీసుకువచ్చి హుజూరాబాద్‌ను సిద్దిపేట తరహాలో తీర్చిదిద్దుతానని చెప్పారు. మాటపై నిలబడకపోతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగనని, మీ ముందుకు రానని కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు. అక్క చెల్లెల్లారా, అన్నదమ్ముల్లారా తనకు ఒక్క అవకాశం కల్పిస్తే హుజూరాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు.

***మా కష్టాన్ని గుర్తించండి..***

గత 15 సంవత్సరాలుగా నియోజకవర్గంలో ఉంటూ ప్రజాసేవ చేస్తున్నామని ఒక్కసారి మా కష్టాన్ని గుర్తించాలని, దండం పెట్టి, కొంగు పట్టి అర్థిస్తున్నా.. ఒక్క అవకాశం ఇవ్వాలని హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెలేయ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి సతీమణి శాలినిరెడ్డి కోరారు. హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా ఉండి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. కౌశిక్‌రెడ్డి కూతురు శ్రీనికారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక-శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల-శ్రీనివాస్, కౌన్సిలర్లు కుమార్‌యాదవ్, తిరుమల్‌రెడ్డి, ముత్యంరాజు, మంజుల కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు నాగరాజు, రామకృష్ణ, లక్ష్మి, స్వామి పటేల్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

***కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి***

ఇల్లందకుంట, నవంబర్ 20: తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంట్ కావాల్నా?, కాంగ్రెస్ చెబుతున్న 3 గంటల కరెంట్ కావాల్నా? ప్రజలే ఆలోచించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాచపల్లి, మల్లన్నపల్లి గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టుతో చివరి ఆయకట్టుకు నీళ్లు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్‌తో పాటు రైతు బంధు, రైతుబీమా వంటి పథకాలను అందించడం జరిగిందన్నారు. పంట రుణమాఫీ రూ.19 వేల కోట్లు మాఫీ చేసినట్లు చెప్పారు. ఒక్కసారి తనను గెలిపిస్తే అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానన్నారు. కారు గుర్తు పై ఓటు వేసి తనను గెలిపించాలని ప్రజలను కోరారు. ఇక్కడ జడ్పీ చైర్‌పర్సన్ విజయ-గణపతి, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, ఎంపీపీ పావని-వెంకటేశ్, సర్పంచులు మానస, లక్ష్మి, దిలీప్‌రెడ్డి, రాజు, అరుణ సదానందం, ఎంపీటీసీలు సంజీవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నగేశ్, బీరయ్య, లాల్‌మహ్మద్ పాల్గొన్నారు.